
చిన్నబోయిన సిద్ధాపురం



సిద్ధాపురం చెరువులో అడుగంటిన జలాలు

- రైతుల కలలను కల్ల చేసిన వైసీపీ ప్రభుత్వం
- ప్రతిపాదనలకే పరిమితమైన అదనపు ఆయకట్టు ప్రాజెక్టు నిర్వహణ గాలికి..
- రూ.30 కోట్ల పెండింగ్ బిల్లులు ఇవ్వకపోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- పూర్తికాని లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ పనులు, ఊసేలేని పంట కాలువలు
- భూసేకరణ పరిహారం చెల్లింపులో జాప్యం
- ముందుకు సాగని కల్వర్టుల పనులు
- నీటి మళ్లింపు తూముల నిర్మాణాల పరిస్థితీ అంతే..
- ప్రాజెక్టు పూర్తవ్వాలంటే మరో రూ.100 కోట్లు అవసరం

ఆత్మకూరు, జనవరి 12:

ఆత్మకూరు పక్కనే కృష్ణా నది ప్రవహిస్తూ ఉంది. కానీ మండలంలోని పొలాలు నీరు లేక బీడుపడిపోయాయి. రైతులకు ఏటా కరువు తాకిడి తప్పేది కాదు. ఈ పరిస్థితుల్లో సిద్ధాపురం ఎత్తిపోతల పథకం అనే ప్రతిపాదన వచ్చింది. దీని కోసం దశాబ్దాలపాటు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకత్వంలో రైతులు ఉద్యమించారు. ఎట్టకేలకు ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2006 ఏప్రిల్ 20న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. అనేక అవాంతరాల వల్ల ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదు. గత టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తి చేసి 2018 జనవరి 7వ తేదీన అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రాజెక్టు నిర్వహణకు నిధులు మంజూరు చేయలేదు. సిద్ధాపురం ఎత్తిపోతల దుస్థితిపై ఆంధ్రజ్యోతి కథనం.

21,300 ఎకరాలకు సాగునీరందించి ఆయకట్టును స్థిరీకరించేలా సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. ఇందులో ఆత్మకూరు మండలంలో 17,950 ఎకరాలు, పాములపాడు మండలంలో 3,350 ఎకరాల ఆయకట్టును నిర్దేశించారు. వెలుగోడు జలాశయంలో 5.6 టీఎంసీలకు నీటి నిల్వలకు తగ్గకుండా ఉన్నప్పుడే సిద్ధాపురం చెరువులోకి 200 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేలా ప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా స్టేజ్-1 పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టి అక్కడి నుంచి రెండు భారీ మోటార్ల ద్వారా (ఒక్కో మోటారు 100 క్యూసెక్కుల సామర్థ్యం) నీటిని 40 అడుగుల ఎత్తులో నిర్మించిన సర్జ్ ట్యాంక్‌లోకి ఎక్కిస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ మీదుగా 6.750 కిమీల దూరం అండర్‌గ్రౌండ్ పైపులైన్ ద్వారా ప్రవహించి స్టేజ్-2 పంప్‌హౌస్‌లోకి చేరుతాయి. అక్కడ వున్న మరో రెండు భారీమోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేయడంతో 0.975 కిమీల దూరంలో వున్న చెరువులోకి వీటీఆర్ జలాలు చేరుకునేలా ప్రాజెక్ట్‌ను నిర్మించారు. కాగా రెండు పంప్‌హౌస్‌లకు విద్యుత్ సరఫరా అందించేందుకు అండర్‌గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్‌తీగలను ఏర్పాటు చేసి 33/11 రెండు పవర్‌స్టేషన్‌లను నెలకొల్పారు. వీటికి ఆత్మకూరు 132/33 విద్యుత్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయినప్పటికీ కాల్వల ఏర్పాటు లేకపోవడంతో నిరుపయోగంగా మారిందనే విమర్శలు ఉన్నాయి.


సిద్ధాపురం ఎత్తిపోతల పథకం

ముందుకు సాగని ప్రధాన కాలువల నిర్మాణాలు

సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మెయిన్ బ్రాంచ్ కెనాల్స్, సబ్ బ్రాంచ్ కెనాల్స్ నిర్మాణ పనులు ఆరేళ్లుగా ముందుకు సాగడం లేదు. చెరువుకు రెండు తూము గేట్ల ఏర్పాటు చేసి ప్రధాన కాల్వల(బ్రాంచ్ కెనాల్స్) ద్వారా ఆయకట్టు పొలాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టును రూపొందించారు. ఇందులో కుడి ప్రధాన కాల్వ 4.895 కిమీల దూరం ప్రవహించి సిద్ధాపురం, కృష్ణాపురం, పిన్నాపురం గ్రామాల్లోని 1440 ఎకరాలకు సాగునీటిని సరఫరా చేయాలి. అదేవిధంగా ఎడమ ప్రధాన కాల్వ 14.895 కిమీల దూరం ప్రవహించి సిద్ధాపురం, పిన్నాపురం, కృష్ణాపురం, సిద్దేపల్లి, నల్లకాల్వ, భానుముక్కల, ఆత్మకూరు, కరివేన, పాములపాడు గ్రామాల్లోని 19,860 ఎకరాలకు సాగునీరు అందించాలి. అయితే ప్రాజెక్ట్ ప్రారంభించి నాలుగేళ్లు గడుస్తున్నా లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ నిర్మాణ పనులు సగానికి కూడా పూర్తికాలేదు. అలాగే 7కిమీలపైగా ఎడమ ప్రధాన కాల్వకు అనుసంధానంగా 2మీటర్ల వెడల్పు, 1.7మీటర్ల లోతుతో ఉపకాల్వల (సబ్ బ్రాంచ్ కెనాల్స్)ను నిర్మించాలి. ఈ పనులు జరగకపోవడంతో కొత్తరామాపురం, నల్లకాల్వ, భానుముక్కల, పాములపాడు తదితర గ్రామాల ఆయకట్టు పొలాలకు కాల్వలు లేక సాగునీరు అందడం లేదు. కాగా పూర్తిస్థాయిలో ఆయా గ్రామాల్లో ఉపకాల్వలను ఏర్పాటు చేయకపోవడం వల్ల మొత్తం 21వేల ఎకరాలకు గాను కేవలం 10వేల ఎకరాలకు మాత్రమే ప్రస్తుతం నీరు అందే పరిస్థితి ఏర్పడింది. ఇంకా 11వేల ఎకరాల ఆయకట్టు పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది.


సిద్ధాపురం చెరువు ఎడమ ప్రధాన కాలువ పరిస్థితి ఇలా..


ఆరేళ్ల క్రితం సిద్ధాపురం ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్న అప్పటి సీఎం చంద్రబాబు

ఎమ్మెల్యే వైఫల్యంతోనే..



శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వైఫల్యంతోనే ఈ ఏడాది రబీ సీజన్‌లో సిద్ధాపురం ఆయకట్టు రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఎమ్మెల్యే శిల్పానే నైతిక బాధ్యత వహిస్తూ బాధిత రైతులందరికీ ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలి.

- బుడ్డా రాజశేఖరరెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే

నిర్వహణ లేక చెరువుకట్టకు గండ్లు

సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో 2021 డిసెంబరు 4వ తేదీన చెరువు కట్టకు గండ్లు పడ్డాయి. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చొరవతో ఇరిగేషన్ అధికారులు గండ్లను పూడ్చేశారు. 2022 డిసెంబరు 15వ తేదీన ఎడమ ప్రధాన కాల్వ తూము గేటును ఎత్తే క్రమంలో గేట్ రాడ్ స్ట్రక్ అవ్వడంతో గేటు ఇనుప రేకులు వంగిపోయాయి. దీంతో సుమారు 100 క్యూసెక్కుల మేర నీరు సమీప పంటపొలాల్లోకి చేరి రైతులు నష్టపోయారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కూడా చిన్నతూము వద్ద కట్టపై రంధ్రాలు పడ్డాయి. చెరువుకట్టకు రివిట్‌మెంట్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

నిధుల్లేక

సిద్ధాపురం ఎత్తిపోతల పథకం పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఈ సమస్య కొలిక్కి వచ్చాక తదుపరి పనులపై దృష్టి సారిస్తాం.

- శివనాయక్, తెలుగుగంగ పథకం ఏఈ, నంద్యాల


2022 డిసెంబరులో మరమ్మతులకు గురైన ఎడమ కాలువ తూము గేట్

ప్రాజెక్టు నిర్వహణ గాలికి..

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాగానే సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నిర్వహణను గాలికి వదిలేసిందనే విమర్శలు ఉన్నాయి. ప్రతిఏటా సిద్ధాపురం ఎత్తిపోతల నిర్వహణకు సుమారు రూ.4 కోట్లు అవసరం. అనేకమార్లు ప్రతిపాదలు పెడితే ప్రభుత్వం మొక్కుబడిగా నిధులు విదిల్చి సరిపెట్టుకుంటోంది. ఈ నిధులతో ఏ పనులు చేపట్టాలో తెలియక అధికారులు వాపోతున్నారు. అలాగే బ్రాంచ్ కెనాల్స్ ఏర్పాటులో భాగంగా భూసేకరణకు సంబంధించి సుమారు రూ.60 లక్షలకు పైగా పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతోంది. వాస్తవానికి కాంట్రాక్టర్ 15ఏళ్ల పాటు వాటర్‌పంపింగ్, 5ఏళ్ల పాటు చెరువు కట్ట నిర్వహణ చూడాలి. రూ.30 కోట్ల వరకు బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. అలాగే మరో రూ.30 కోట్ల విద్యుత్ బిల్లులు బకాయి ఉండటంతో అనేకమార్లు విద్యుత్ అధికారులు నోటీసులు జారీ చేశారు. సబ్ బ్రాంచ్ కెనాల్స్‌కు అనుబంధంగా పంటకాల్వలను నిర్మించాల్సి ఉండగా ఇంతవరకు ఆ ఊసే లేకుండా పోయింది. మెయిన్ బ్రాంచ్, సబ్ బ్రాంచ్ కెనాల్స్‌పై అక్కడక్కడ కల్వర్టుల నిర్మాణాలు, పలు చోట్ల నీటి మళ్లింపు తూము నిర్మాణ పనుల్లో కూడా పురోగతి లేదు. నిబంధనల ప్రకారం పెండింగ్ పనులన్నింటినీ 2019 మార్చి చివరిలోగా పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ నిధుల కొరతతో పనులకు బ్రేక్ పడింది. కాగా మట్టికట్టపై విస్తారంగా పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగిపోవడంతో చెరువుకట్టకు ప్రమాదం పొంచివుంది. నిధుల కొరతతో జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా జరగలేదు. బ్రాంచ్ కెనాల్స్ కూడా పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. చివరకు ప్రాజెక్టు గేట్ల నిర్వహణకు ప్రత్యేక లస్కర్లను కూడా నియమించలేదు. దీంతో నీటివిడుదల ఇష్టారాజ్యంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు అనుసంధానంగా వెంకటాపురం గ్రామ సమీపంలోని కుడి ప్రధాన కాల్వ నుంచి 6కిమీల దూరంలో వున్న ఇందిరేశ్వరం, శ్రీపతిరావుపేట గ్రామాల్లోని సుమారు 4500 ఎకరాలకు ఎత్తిపోతల జలాలను అందించేందుకు పనులను గత ప్రభుత్వం ఆమోదించింది. ఈ పనులు కూడా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఈ పనులన్నీ పూర్తవ్వాలంటే రూ.100కోట్ల నిధులు అవసరం.


పూజలు అందుకున్న చండీశ్వర స్వామి


పూలతో అలంకరించి ధ్వజస్తంభ ప్రాంగణం

శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం, జనవరి 12: శ్రీశైలం మహా క్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని శుక్రవారం సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పంచాహ్నిక దీక్షతో నిర్వహించబడే ఈ ఉత్సవాలు ఈ నెల 18 తేదీ గురువారంతో ముగియనున్నాయి. ఏడు రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు మొదటి రోజు ఉదయం 8.30 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. లోక కల్యాణం కోసం నిర్వహించబడే బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ స్వామివారికి విశేషార్చనలు, భ్రమరాంబాదేవికి ప్రత్యేక పూజలు, నవగ్రహ మండపారాధనలు, కలశార్చనలు, జపాలు, పారాయణలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు యాగశాల ప్రవేశం చేసి అనంతరం వేదపండితులు చతుర్వేద పారాయణాలతో వేదస్వస్తి నిర్వహించారు. తరువాత దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని ఆలయ అర్చకులు, వేదపండితులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ చేసి, శివ సంచార దేవతలలో ఒకరైన చండీశ్వరునికి విశేష పూజలు జరిపారు. చండీశ్వర స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించబడతాయని చెప్పబడుతుంది. కంకణాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి వాటిని అర్చకులు, స్థానాచార్యులు, అధికారులు ధరించారు. తరువాత రుత్విగ్వరణం నిర్వహించి, అఖండ దీపస్థాపన, వాస్తుపూజ, వాస్తు హోమం జరిపించి మండపారాధన, పంచావరణార్చన, ప్రధాన కలశస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. సాయంకాలం అంకురార్పణ కార్యక్రమం జరిపించారు. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ధ్వజస్తంభం మీద కొత్త వస్త్రంపై పరమశివుని వాహనమైన నందీశ్వరుని,అష్టమంగళ చిత్రాలను చిత్రించిన నందిధ్వజపటంను పతాకావిష్కరణ చేశారు. ధ్వజారోహణ కార్యక్రమంలో భాగంగానే భేరీ పూజ నిర్వహించారు. ధ్వజస్తంభం మీద ఎగిరే ఈ నంది పతాకమే సకల దేవతలకు, యక్ష, గంధర్వ గణాలకు ఆహ్వానం అని, ఉత్సవాలు తిలకిస్తారని ఆగమశాస్త్రాలు పేర్కొంటున్నాయి.

- **నేడు స్వామి అమ్మవార్లకు భృంగి వాహన సేవ**

బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సాయంకాలం స్వామి, అమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలో భాగంగా స్వామి,అమ్మవార్లకు విశేష పూజలు, చండీశ్వరపూజ, మండపారాధనలు, పంచావరణార్చనలు, జపానుష్ఠానాలు, రుద్రహోమం, సాయంకాలం నిత్యహవనాలు జపాలు, పారాయణలు మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తారు.


స్వామి వారికి చండీశ్వర పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సామాజిక స్పృహతో విద్యార్థులను తీర్చిదిద్దండి

సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వీ రమణ


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 10: సామాజిక స్పృహతో విద్యార్థులను అన్ని రకాలుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ ఎన్‌వీ రమణ పేర్కొన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక ధర్నా చౌక్ నుంచి భారీ ఎత్తున ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. డ్యాన్స్‌లతో, కోలాటాలతో జరిగిన ర్యాలీ ముగిశాక ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో రిటైర్డు చీఫ్ జస్టిస్ రమణ మాట్లాడుతూ తనకు ఆరోగ్యం బాగలేకపోయినా వామపక్ష భావజాలంతో ఉన్న ఎస్‌టీయూపై ఉన్న అభిమానంతో సభకు హాజరయ్యానని అన్నారు. పాఠ్యపుస్తకాల్లో ఉన్నది మాత్రమే కాకుండా జీవితాన్ని కూడా ఉపాధ్యాయులు బోధించి అన్ని రకాలుగా విద్యార్థులను అభివృద్ధి చేయాలని అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు కేవలం చదువు చెప్పే కార్ఖానాలుగా మారాయని అన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కే. నారాయణ మాట్లాడుతూ సమసమాజ స్థాపనలో వామపక్ష భావజాలం వున్న ఎస్‌టీయూ ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవాలన్నారు. పశ్చిమ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర యాప్‌ల నుంచి విముక్తి కల్పించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంఎల్ఏ హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎస్‌వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్‌టీయూ పోరాట పటిమ ప్రశంసనీయమని అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యో ఆర్థర్

సిట్టింగ్‌కు సీటు కష్టం

పోటీపడుతున్న ఆ ఐదుగురు..
- రసకందాయంలో నందికొట్కూరు రాజకీయం
- ఓ ముగ్గురి పేర్లను ప్రతిపాదించి బైరెడ్డి సిద్ధార్థ
- తెరపైకి కడపకు చెందిన డాక్టర్ సుధీర్
- శాప్ చైర్మన్ మద్దతూ ఆయనకేనని ప్రచారం
- టీడీపీ వైపు చూస్తున్న ఆర్థర్ వర్గం?



సీఎం జగన్‌ను కలిసిన డా. సుధీర్ (ఫైల్)

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. వైసీపీ అధిష్టానం నుంచి ఎవరికి పిలుపు వస్తుందో? ఎవరికి టికెట్‌ను నిరాకరిస్తారో? అన్న ఆందోళన ఆయా నియోజకవర్గ నాయకుల్లో మొదలైంది. ఆయా నేతల ప్రజల్లో ఉన్న అసంతృప్తిని బట్టి సిటింగ్ ఎమ్మెల్యేలను మారుస్తున్నట్లు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ప్రకటించిన ఇన్‌చార్జుల పేర్లను చూస్తే అర్థమవుతోంది. జిల్లాలో కూడా ఇదే ప్రాతిపదికన టికెట్లను ఇచ్చే అవకాశముందన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. అయితే నందికొట్కూరు నియోజకవర్గానికి సంబంధించిన విషయంలో మాత్రం వైసీపీ ఇందుకు భిన్నంగా వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్‌పైన ప్రజల్లో మంచి పేరే ఉన్నా, నియోజకవర్గ ఇన్‌చార్జి బైరెడ్డి సిద్ధార్థ ప్రతిపాదించిన వారికి టికెట్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. తన సామాజిక వర్గం వారిని ఖుషీ చేసేందుకు జిల్లాలోని ఏకైక ఎస్సీ ఎమ్మెల్యేకు అన్యాయం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఇదే జరిగితే ఆర్థర్ వర్గం టీడీపీ వైపు మళ్లే అవకాశం ఉందన్న అభిప్రాయం కూడా ఉంది.

నంద్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి)/ నందికొట్కూరు: 2019 ఎన్నికల్లో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బైరెడ్డి సిద్ధార్థను నియమించగా, ఆర్థర్‌కు టికెట్ కేటాయించింది. ఇద్దరు సమన్వయంతో పని చేయడంతో ఆ ఎన్నికల్లో వైసీపీ తరఫున ఆర్థర్ విజయం సాధించారు. అయితే ఆ తర్వాత అసలు ఆట మొదలైంది. తన బలంతోనే ఆర్థర్ గెలిచాడంటూ సిద్ధార్థ నియోజకవర్గంలో చక్రం తిప్పడం మొదలు పెట్టారు. నందికొట్కూరులో ఏపని జరగాలన్నా తన అనుమతి ఉండాలన్నట్లుగా ప్రవర్తించడం మొదలు పెట్టారు. కనీసం చిన్న చిన్న పనులు, ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో కూడా ఆర్థర్‌కు ప్రాధాన్యం లేకుండా చేశారు. దీంతో సిద్ధార్థ వ్యవహారంపై ఎమ్మెల్యే, అతని వర్గానికి తీవ్ర ఇబ్బందిగా తయారైంది. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోగా కలిసి పని చేయాలంటూ ఆర్థర్‌కే చెప్పినట్లు ప్రచారం సాగింది. దీంతో సిద్ధార్థ మరింత దూకుడుగా వ్యవహరించాడు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలో టికెట్ల కేటాయింపు వ్యవహారంలో అధిక శాతం తన వారికే ఇవ్వాలంటూ సిద్ధార్థ పట్టుబట్టాడు. అన్నీ ఇస్తే తన వర్గం వారికి అన్యాయం చేసినట్లు అవుతుందని ఆర్థర్ పార్టీ పెద్దలకు చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన సిద్ధార్థ అతని వర్గం అప్పటి ఉమ్మడి కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిల్ కుమార్ యాదవ్ సమక్షంలోనే కర్నూలు పాత బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఎమ్మెల్యే ఆర్థర్, అతని వర్గంపై దాడికి దిగారు. మళ్లీ కొద్ది కాలానికి కర్నూలులోని కొత్త బస్టాండ్ వద్ద గల ఓ ప్రైవేటు హోటల్ లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఎదుట మళ్లీ దాడి చేసేందుకు సిద్ధార్థ వర్గం ప్రయత్నించింది. ఇలా ఈ నాలుగేళ్లలో ఆర్థర్‌ను అవమానపరుస్తూ, ఇబ్బందులకు గురి చేస్తూనే ఉన్నాడు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న ఆర్థర్ నియోజకవర్గంలో సిద్ధార్థ ప్రమేయాన్ని వ్యతిరేకిస్తున్నాడు. సిద్ధార్థ తనకు అడ్డు తగలకుండా ఉంటాడని హామీ ఉంటేనే తాను ఎమ్మెల్యేగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని, లేకుండా తన దారి తాను చూసుకుంటానని చెప్పినట్లు సమాచారం. అయితే సిద్ధార్థ ప్రమేయం లేకుండా ఆర్థర్‌కు టికెట్ ఇస్తే ఓటమి తప్పదని పార్టీ అధిష్టానం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

● లెక్క గట్టిగా ముట్టజెప్పే వారికే..

సర్వేల్లో ఆర్థర్‌కు అనుకూలంగానే ఫలితాలు వచ్చాయి. అయితే అధిష్టానం ఇవేవి పట్టించుకునే స్థితిలో లేదు. టికెట్ కేటాయింపు కోణాన్ని డబ్బు కోణంలోనే చూస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఖర్చు పెట్టలేని ఆర్థర్‌ను కాదని, లెక్క గట్టిగా ముట్టజెప్పడంతో పాటు, ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు పంచే వ్యక్తి కోసం గాలిస్తోందని సమాచారం. అందుకే తెరపైకి కొత్త వ్యక్తులను తీసుకు వస్తున్నట్లు అధికారపార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.



నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్

● ఎవరికి వారే ప్రయత్నాలు..

నందికొట్కూరు టికెట్ కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్ కాకుండా మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, వేల్పుల ఆనంద్, ఎక్కలదేవి చంద్రమౌళి పేర్లు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురు కూడా సిద్ధార్థ వర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. వీరి పేర్లను ఇప్పటికే సిద్ధార్థ వైసీపీ అధిష్టానానికి సూచించినట్లు తెలుస్తోంది. లబ్బి వెంకటస్వామి గతంలో గెలిచిన చరిత్ర ఉండటం వల్ల ఈసారి గట్టిగా ప్రయత్నిస్తే తనకు టికెట్ ఖాయం అన్న ధీమా లో ఉన్నాడు. ఇక సిద్ధార్థ నందికొట్కూరు వచ్చినపుడు, ఆయన చేసే కార్యక్రమాలకు డబ్బులు బాగానే ఖర్చు పెట్టాడన్న ప్రచారం ఉంది. దీంతో సిద్ధార్థ తనకు మద్దతు పలుకుతారని, టికెట్ రావడం పెద్ద కష్టం కాదని చంద్రమౌళి భావిస్తున్నారు. సిద్ధార్థ తన వైపే ఉన్నాడు కాబట్టి తనకు టికెట్ వస్తుందని ఆనంద్ యోచిస్తున్నాడు. దీంతో ఎవరికి వారే టికెట్ ప్రయత్నాల్లో మునిగిపోయారు. ఇప్పటికే వీరి పేర్లను పార్టీ పెద్దలు పరిశీలించినట్లు తెలుస్తోంది. వీరిపై ఇప్పటికే సర్వే నిర్వహించగా ఈ ముగ్గురికి ప్రతికూల ఫలితాలు వచ్చినట్లు సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యేను నమ్మి ఎన్నికలకు పోలేక.. సిద్దార్థరెడ్డి వర్గానికి చెందిన అభ్యర్థులను ఖరారు చేయలేక అధిష్టానం సతమతవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయంగా కడప జిల్లాకు చెందిన డా.సుధీర్ పేరును తెరపైకి తీసుకు వచ్చారు. ఈయన హైదరాబాదులో వైద్యుడుగా పని చేస్తున్నాడు. జగన్‌తో సన్నిహిత సంబంధాలు ఉండటంతో నందికొట్కూరు నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఆయన సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసి దిగిన ఫొటో ఒకటి నందికొట్కూరు నియోజకవర్గంలో చక్కర్లు కొడుతుండటం ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. అయితే సుధీర్ అభ్యర్థి అనే విషయాన్ని సిద్ధార్థ వర్గం జీర్ణించుకోలేకపోతున్నట్లు సమాచారం.

● సిద్ధార్థ వర్గంలో ఆందోళన..

నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేయడాన్ని సిద్ధార్థ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ విషయంపై సిద్ధార్థను నిలదీసినట్లు కూడా సమాచారం. తమకు టిక్కెట్ వస్తుందని ఆశతో ఇన్ని రోజులు ఖర్చు పెట్టుకున్నామని, ఇప్పుడు తమ పేరు కాకుండా ఇతరులను తెరపైకి తెస్తే తమ సంగతి ఏమిటని సిద్ధార్థ వర్గీయులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత వీరిలో కొంతమంది నాన్ లోకల్ అభ్యర్థులకు సీటు ఇవ్వడం సరికాదని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. లబ్బి వెంకటస్వామి ఏకంగా విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి నియోజకవర్గంపై అవగాహన లేని వారికి టిక్కెట్ ఇస్తే సహించేది లేదన్నారు. అయితే సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎవరినైతే అభ్యర్థిగా ప్రకటిస్తారో వారిని గెలిపిద్దామని ఆయన నాయకులు, కార్యకర్తలకు సూచించినట్లు సమాచారం. ఇలా అయితే తమ టికెట్ ఆశలు గల్లంతవుతాయని భావించిన లబ్బి వెంకటస్వామి, సిద్ధార్థతో కలిసి మొన్న సోమవారం విజయవాడలో జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. ఇదిలాఉంటే అసలు కడపకు చెందిన డా.సుధీర్‌ను తెరపైకి తీసుకు వచ్చింది సిద్ధార్థేనన్న ప్రచారం మరోవైపు జరుగుతోంది. అధిష్టానానికి నామమాత్రంగా ఇక్కడి వారి పేర్లు సూచించి తనకు కడపలో ఉన్న సంబంధాలను దృష్ట్యా డా.సుధీర్‌కు మద్దతు తెలుపుతున్నాడన్న ప్రచారం సాగుతోంది.



సీఎం జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకట స్వామి (ఫైల్)

● టీడీపీ వైపు ఎమ్మెల్యే వర్గం చూపు..

ఇటు సిద్ధార్థ.. అటు పార్టీ అధిష్టానం ఇతరుల పేర్లు పరిగణలోనికి తీసుకోవడంతో ఎమ్మెల్యే ఆర్థర్ వర్గంలో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. సీఎం సొంత జిల్లాకు చెందిన వ్యక్తి పేరు తెరపైకి రావడంతో ఎమ్మెల్యే సైతం ఏమి చేయలేని స్థితిలో పడ్డారు. ఎమ్మెల్యేకే టిక్కెట్ వస్తుందన్న నమ్మకంతో ఉన్న ఆర్థర్ వర్గంలో గుబులు మొదలైంది. టిక్కెట్ రాకపోతే తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనలో ఆయన వర్గం పడిపోయింది. దీంతో నాలుగు రోజుల కిందట కర్నూలులోని ఎమ్మెల్యే నివాసంలో తన వర్గంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సర్వేల్లో మంచి ఫలితాలు ఉన్నా వేరే వారి పేర్లను ఆలోచిస్తోందంటే, పార్టీకి తమ అవసరం లేదని భావిస్తోందన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చినట్లు తెలుస్తోంది. అవసరం లేదనుకున్న పార్టీలో ఉండాల్సిన అవసరం లేదని కొంతమంది ముఖ్య నాయకులు ఆర్థర్ ముందు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ముందుగానే ఏదో దారి చూసుకుంటే మంచిదన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చినట్లు సమాచారం. ఇక ఆర్థర్‌కు భార్య తరుఫున చుట్టరికం ఉన్న నంద్యాలకు చెందిన కొంతమంది టీడీపీలో చేరితే ఎలా ఉంటుందని ఇక్కడి నాయకులను అడిగినట్లు సమాచారం. మొత్తానికి కొత్తవారికి టిక్కెటు ఇస్తే ఎమ్మెల్యే ఆర్థర్‌కు తీవ్రంగా అన్యాయం చేయడమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సైబర్ క్రైం పోలీసుల హెచ్చరిక

● 9346188819 సెల్ నెంబర్ నుంచి కాల్ వచ్చిందా.. జాగ్రత్త

నంద్యాల క్రైం, జనవరి 12: ఆధునిక సాంకేతికతను సైబర్ కేటుగాళ్లు అనుకూలంగా మలుచుకుంటున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయాలనే ఉద్దేశంతో సెల్‌ఫోన్ నెం 9346188819 నుంచి కాల్ చేసి తాను ఏఎస్పై అశోక్ కుమార్ అని గాని, అశోక్‌రెడ్డి అని గానీ లేదా ఫలానా ప్రభుత్వ శాఖ అధికారి ననిగాని నమ్మబలికి తమ బంధువులు ఆస్పత్రిలో ఉన్నారని, తన ఫోన్ పేలో డబ్బులు లేవని, అర్జంట్‌గా పంపిస్తే గంటలో తమ పోలీస్ కానిస్టేబుల్‌తో నగదు పంపిస్తానని మోసం చేస్తారని అన్నారు. ఇలాంటి సైబర్ మోసాలు ఇప్పటికే రాష్ట్రంలో 14 కేసులు నమోదయ్యాయని తెలిపారు. నంద్యాలలోనే ఐదు కేసులు నమోదయ్యాయని వివరించారు. డోన్, ఆత్మకూరు, చాగలమర్రి, గడివేముల, బనగానపల్లె ప్రాంతాల్లో సైబర్ క్రైం మోసాలు జరిగాయని వెల్లడించారు. ఎవరైనా ఈ మోసాలకు గురైతే వెంటనే 24 గంటల్లోపు నేషనల్ సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సైబర్ క్రైం ఆఫీస్‌కు వచ్చిగాని 9154987034 నెంబరు ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా ఆటో డ్రైవర్ మృతి



ఆటోకు ఉరి వేసుకున్న ఎరుకలి రాముడు

పత్తికొండ, జనవరి 12: అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన పత్తికొండ శివారులో సిద్ధం పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. ఆదోని ఇంద్రానగర్‌కు చెందిన ఎరుకలి రాముడు (41) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య సులోచనతోపాటు ముగ్గురు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మద్యానికి బానిసైన రాముడు నిత్యం భార్యతో గొడవకు దిగి ఇంటి నుంచి వెళ్లిపోయేవాడు. మూడునెలల క్రితం భార్యతో గొడవ పడి వెళ్లిపోయి రెండు రోజులు క్రితం ఇంటికి వచ్చాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి మళ్లీ భార్యతో గొడవపడి ఇంటి నుండి వెళ్లిపోయాడు. పత్తికొండ శివారులో సిద్ధం పెట్రోల్ బంక్ వెనుక నిర్మానుష్యప్రాంతంలో మద్యం తాగి ఆటోకు ఉరి వేసుకున్న స్థితిలో మృతి చెంది కనిపించాడు. ఆటోలో ఉన్న లైసెన్స్ ఆధారంగా మృతుడిని గుర్తించిన పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ మురళీమోహన్ తెలిపారు.

గుప్తనిధుల కలకలం

వెల్దుర్తి, జనవరి 12 : మండలంలోని రామళ్లకోట గ్రామంలో వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గుప్తనిధుల కలకలం చెలరేగింది. గురువారం అమావాస్య కావడంతో గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడి ఆలయ మండపం పైకప్పు భాగంలో ఒకే రాతితో సీలింగ్‌కు చెక్కబడిన రాతి కమలాన్ని ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. పూజారి సురేష్ రోజూ మాదిరిగానే ఆలయం తెరవడానికి శుక్రవారం తెల్లవారుజామున వెళ్లాడు. రాతి కమలాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన ఈ విషయాన్ని గమనించి స్థానికులు, ఆలయ కార్యనిర్వహణ అధికారికి తెలియజేశారు. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసులు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కేంద్ర మంత్రి

మంత్రాలయం, జనవరి 12 : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కేంద్ర బొగ్గు, గనులు శాఖ మంత్రి ప్రహ్లాదజోషి శుక్రవారం సాయంత్రం మంత్రాలయం వచ్చారు. ఈయనకు పద్మనాభ తీర్థ గెస్ట్‌హౌస్ వద్ద డీఎస్పీ సీతారామయ్య, శ్రీమఠం అధికారులు ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్ ఘనంగా స్వాగతం పలికారు. రాత్రి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. శుక్రవారం మంత్రాలయంలోనే బసచేసి శనివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులు పొందనున్నారు. కార్యక్రమంలో గిరీశ్ కనకవీడు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు, ఏఎస్ఐ ఆనంద రెడ్డి, వ్యాసరాజ్ ఆచార్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు మిర్చి యార్డుకు సెలవు

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 12 : ఈ నెల 14న ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని మిర్చి యార్డుకు సెలవు ఉంటుందని యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం వ్యాపారుల విజ్ఞప్తి మేరకు క్రయవిక్రయాలు జరగవన్నారు. యథావిధిగా బుధవారం నుంచి మిర్చి కొనుగోళ్లు ఉంటాయని తెలిపారు.

నలుగురు నిందితుల అరెస్టు

టాటా సుమో వాహనం.. ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం

సూత్రధారి ఏపీఎస్పీ బెటాలియన్‌లో పని చేసిన కానిస్టేబుల్



నిందితులతో డీఎస్పీ వెంకటరామయ్య

ఆళ్లగడ్డ, జనవరి 12: గతంలో ఏపీఎస్పీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేసి అవినీతి ఆరోపణలతో ఉద్యోగం పోగొట్టుకున్న రుద్రవరానికి చెందిన గోన నాగేంద్రుడిని, మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు. పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గోన నాగేంద్రుడు వివిధ ప్రాంతాలలో కిడ్నాపులకు పాల్పడేందుకు ఒక ముఠాను తయారు చేశాడని అన్నారు. ఎనిమిది మంది ఉన్న ఈ ముఠాలో అతనితోపాటు ఇండ్ల రాముడు, అడ్డాకుల రాముడు, ఒక మైనరును శుక్రవారం ఆళ్లగడ్డ రూరల్ పరిధిలోని పెద్దకందుకూరు మెట్ట వద్ద రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ నరసింహులు అరెస్టు చేశారని ఆయన వివరించారు. వీరితో పాటు టాటాసుమో, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని ఆయన చెప్పారు. వీరంతా అహోబిలంలో ఈ నెల 4వ తేదీన ఏపీ 27 టీవీ 0823 నంబరుగల టాటా సుమోను దొంగలించినట్లు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ వాహనంతో కడప జిల్లా కామనూరుకు చెందిన బాగా డబ్బున్న నంద్యాల రామవరదరాజురెడ్డిని కిడ్నాపు చేసి రూ. 50 లక్షలు డిమాండు చేయాలని ప్రయత్నించి విఫలం అయ్యారని అన్నారు. దీనిపై ప్రొద్దుటూరు పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు. గత ఏడాది అక్టోబరు నెలలో జీపు బాడుగకు తీసుకొని నంద్యాల దగ్గరలోని పెద్దకొట్టాలకు చెందిన టీ కొట్టు శెట్టిని కిడ్నాపునకు ప్రయత్నించారని, నవంబరు నెలలో రుద్రవరం సుబ్బయ్యను బొలేరా వాహనంలో కిడ్నాపునకు యత్నించారని అన్నారు. అలాగే అహోబిలం ఫైనాన్స్ సుబ్బారెడ్డి, దువ్వూరు రామకృష్ణారెడ్డిలను కిడ్నాపు చేసేందుకు ఈ ముఠా ప్రయత్నించి విఫలమైందని అన్నారు. ఈ ముఠాపై రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ నరసింహులు తమ సిబ్బందితో నిఘా ఉంచి నల్గురిని అరెస్టు చేసినందులకు డీఎస్పీ వెంకటరామయ్య అభినందించారు.

ఆర్‌యూలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ పరిశీలన

కర్నూలు, కలెక్టరేట్ జనవరి 12 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లలో భాగంగా రాయలసీయ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ఏర్పాటు కోసం భవనాలను కలెక్టర్ డాక్టర్ జి సృజన, ఎస్పీ కృష్ణ కాంత్ పరిశీలించారు. శుక్రవారం కలెక్టర్ ఎస్పీ రాయలసీమ యూనివర్సిటీలోని సాంకేతిక శాస్త్ర కళాశాల బ్లాక్, లైఫ్ సైన్స్ బ్లాక్, అకాడమిక్ బ్లాక్ 4, ఓల్డ్ లైబ్రరీ, నూతన లైబ్రరీ తదితర భవనాలను పరిశీలంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 8 నియోజకవర్గాలకు సంబంధించి రాయలసీయ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, రిసెప్షన్ సెంటర్లకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ నారపు రెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్ఓ మధుసూదన్ రావు తదితదరులు పాల్గొన్నారు.



భవనాలను పరిశీలిస్తున్న కలెక్టరు, ఎస్పీ

అహోబిలాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



నైవేద్యం సమర్పిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ, జనవరి 12: అహోబిలం లక్ష్మీనరసింహస్వామికి నూరు తడ నైవేద్యం అర్చకులు శుక్రవారం సమర్పించారు. అహోబిలం క్షేత్రంలో జరుగుతున్న 27వ రోజు ధనుర్మాస పూజల్లో భాగంగా నైవేద్య సమర్పణలో పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ పాల్గొన్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు.

డిగ్రీలో ఏడుగురి డీబర్

కర్నూలు(అర్బన్), జనవరి 12: డిగ్రీ 1, 5 సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని 16 పరీక్షా కేంద్రాల్లో 1వ సెమిస్టర్‌లో 830కి 749 మంది, 5వ సెమిస్టర్లో 5,753 మందికి 5,488 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

క్రిష్ణగిరి, జనవరి 12: మండలంలోని తెగడొడ్డి గ్రామానికి చెందిన బోయ మల్లికార్జున విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందాడు. మల్లికార్జున తన కొట్టం సమీపంలో కొత్తగా కట్టుకున్న ఇంటికి నీళ్ళు కొట్టేందుకు మోటార్ ఆన్ చేయగా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొడుకు బోయ గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆధ్యాత్మిక విలువలు పెంచుకోవాలి

● ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



ప్రవచన బోధ చేస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కర్నూలు(కల్చరల్), జనవరి 12: విద్యార్థుల్లో బాల్యం నుంచే ఆధ్యాత్మిక విలువలు పెంచాలని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు సూచించారు. శుక్రవారం నగరంలోని ఎస్ఏపీ క్యాంపు టీజీ వెంకటేశ్ క్రీడా మైదానంలో, యువ ప్రజా నాయకుడు టీజీ భరత్ సహకారంతో ఏర్పాటు చేసిన 'విద్యార్థులతో ముఖాముఖి' కార్యక్రమంలో చాగంటి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి వందలాదిగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉద్బోధించారు. చదువుకునే సమయంలో ఒత్తడి గురైనట్లు గమనిస్తే ఆ ఒత్తిడిని తగ్గించుకునేందుకు హాస్య సంబంధ కథలు చదవాలని, వినాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమకు అభిరుచి ఉన్న రంగాల్లో సాధన చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వ్యక్తం చేసిన పలు సందేహాలను ఆయన సోదాహరణలతో వివరించారు.

కేడీసీసీ చైర్‌పర్సన్‌గా

మరో ఆరు నెలల పొడిగింపు



విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 12: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్‌పర్సన్‌గా విజయమనోహరి పదవీ కాలాన్ని మరో ఆరునెలలు పొడిగిస్తూ ప్రభుత్వం జీవో నెం 28ని జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ప్రకారం ఈ నెల 18 నుంచి జూలై 17 వరకు విజయమనోహరి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మెన్‌గా కొనసాగుతారని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి తెలిపారు. కర్నూలుతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, ప్రకాశం, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు ప్రభుత్వం పొడిగించింది. డైరెక్టర్లు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ప్రెసిడెంట్ల పదవీ కాలం కూడా పొడిగించినట్లు ఉత్తర్వులు వచ్చాయని అధికారులు తెలిపారు.

బీసీల గొంతు కోసిన జగన్

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఏవీఆర్ ప్రసాద్



మాట్లాడుతున్న ఏవీఆర్ ప్రసాద్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 12: రాష్ట్రంలో బీసీ వర్గాలకు చెందిన కులాలను అణగదొక్కుతూ బీసీల గొంతు కోసిన జగన్ చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఏవీఆర్ ప్రసాద్, జిల్లెల్ల శ్రీరాములు అన్నారు. శుక్రవారం నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ బీసీ సాధికారత కమిటీల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో బీసీలు సొంత కాళ్లపై నిలబడే సంక్షేమ పథకాలను అమలు చేస్తే జగన్ మోహన్‌రెడ్డి వాటిని రద్దు చేసి ఆ కాళ్లను విరగొట్టి బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు. రూ.75 వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిన ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నందమూరి తారక రామారావు, చంద్రబాబు నాయుడు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే వాటిని జగన్‌మోహన్‌రెడ్డి 24 శాతానికి కుదించి 16800 రాజ్యాంగ బద్ధ పదవులను దూరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ కార్పొరేషన్లు, ఫెడరేషన్ల ద్వారా రాష్ట్రంలో 4 లక్షల మంది లబ్ధిపొందితే వైసీపీ పాలనలో 56 కార్పొరేషన్లు పెట్టిన జగన్ ఒక్క రూపాయి కూడా బీసీలకు కేటాయించకుండా ఎన్నికలకు ఓట్ల కోసం బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఐక్యమత్యంగా వైసీపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బోయ గోవిందనాయుడు, జిల్లా వాల్మీకి సాధికార కమిటీ అధ్యక్షుడు బోయ రామకృష్ణ, కాశన్న, వెంకటరమణ, శీలం రమణ, తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ

శ్రీశైలం, జనవరి 12: శ్రీశైలం మహాక్షేత్రంలో శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను ఘనంగా నిర్వహించింది. ముందుగా మహాగణపతి స్వామికి పూజలు జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి పూజలు చేశారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళహారతులు సమర్పించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమం

శ్రీశైలం, జనవరి 12: శ్రీశైలం దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధనలో శుక్రవారం స్నేహ సంగీత నాట్య అకాడమీ, మార్కాపురం బృందం సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలు గీతాలకు గాయత్రి, దీపిక, లిఖిత, తేజశ్రీ, భవ్యశ్రీ తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

కడదాక కష్టాలే..



వెలుగోడు, జనవరి 12 : మండలంలోని బోయరేవుల గ్రామంలో ఎస్సీ శ్మశాన వాటికకు రహదారి లేక దళితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చనిపోయిన వారికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఎంతో కష్ట పడాల్సి వస్తోంది. శ్మశానానికి సరైన రహదారి లేక ముళ్ల పొదలు, గాలేరు నది దాటాల్సి వస్తోందని గ్రామ దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సీ శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నందీశ్వరునికి పల్లకీ సేవ

మహానంది,జనవరి 12: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి ఘనంగా పల్లకీ సేవ ఉత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని కల్యాణ మంటపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

సమ్మె విరమించం



నంద్యాలలో సమ్మె కొనసాగిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



జూపాడుబంగ్లాలో మోకాళ్లపై నిరసన

నంద్యాల (నూనెపల్లె), జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం యూనియన్లతో జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మె కొనసాగించేదేనని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల స్పష్టం చేశారు. జిల్లా వాయప్తంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 32వ రోజుకు చేరాయి. వివిధ మండలాల్లో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం అవుతాయని ఆశించామని, ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించలేదని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా ఒప్పుకోవాలని ఒత్తిడి తేవడంతో చర్చలు విఫలమైనట్లు పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పగిడ్యాలలో కేసీ కాలువలో దిగి నిరసన



ఆత్మకూరులో దీక్షలకు మద్దతు తెలిపిన న్యాయవాదులు

ఎమ్మెల్యే వచ్చారు.. వెళ్లారు

- జడ్పీటీసీ గైర్హాజరు
- తూతూ మంత్రంగా నంద్యాల మండల సమావేశం
- భూ రక్షణ సర్వే లోపభూయిష్టం : మార్కెట్ యార్డు చైర్మన్
- ఎకరాకు 2, 3 సెంట్లు తేడా వాస్తవమే : తహసీల్దార్

నంద్యాల రూరల్, జనవరి 12 : ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సర్వ సమావేశం చర్చల గోలెందుకు అనుకుందేమో..! నంద్యాల మండల ప్రజా పరిషత్ సాక్షాత్తు జడ్పీటీసీ గైర్హాజరుతో ప్రజా సమస్యల ఊసే లేకుండా సమావేశాన్ని మ.. మ.. అనిపించారు నంద్యాల మండల పరిషత్ అధికారులు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై మండల సమస్యలను చర్చించి వాటిని పరిష్కరించాల్సిన సర్వసభ్య సమావేశం ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం ఆలస్యంగా మొదలైంది. వాస్తవానికి 11.00 గంటల సమయానికి మొదలవ్వాల్సిన సమావేశం ఎమ్మెల్యే శిల్పా రవిచం ద్రకిశోషోర్ రెడ్డి వచ్చే వరకు జరగలేదు. సుమారు రెండు గంటలకు పైగా ఆలస్యంగా వచ్చిన ఎమ్మెల్యే సమస్యలపై పెద్దగా చర్చించకుండానే అధికారులతో మాట్లాడి వెళ్లిపోయారు. మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వర్ రెడ్డి భూ రక్షణ పథకం సర్వే సక్రమంగా జరగటం లేదని, అనుభవం లేని సర్వేయర్లు తప్పుడు భూ హక్కు ప త్రాలు ఇస్తున్నారని తహసీల్దార్ దృష్టికి తెచ్చారు.



ఖాళీగా ఉన్న వేదిక

తేడాలు వాస్తవమే

ఎమ్మార్వో మాట్లాడుతూ భూ సర్వేలో తేడాలున్న విషయమే వాస్తవమని ఎకరాలకు 2 నుంచి 3 సెంట్ల వరకు తేడా వస్తుందని పరిశీలిస్తామన్నారు. మునగాల సర్పంచు లోకేష్ రెడ్డి మట్లాడుతూ గ్రామంలో సచివాలయం లేకపోవటంతో అధికారులు సైతం గ్రామం వైపు రావటం లేదన్నారు. చాబోలు ఎంపీటీసీ చెన్నయ్య మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పేదలకు ఇళ్ల పట్టాలు త్వరగా మాంజూరు చేయాలని కోరారు. మండలంలో 17 మంది సర్పంచ్‌లు 20 మంది ఎంపిటీసీలకు గాను కేవలం 12 మంది మా త్రమే సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీఓ సుగుణ శ్రీ బిల్లలాపురం ఎంపీటీసీ రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడులు

- 18 లీటర్ల సారా స్వాధీనం



నందికొట్కూరులో సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు రూరల్, జనవరి 12: మండలంలోని బైర్లూటి గూడెం శివారు నల్లమల అటవీ ప్రాంతంలో సీఐ నాగభూషణ్, ఎస్ఐ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బైర్లూటి గూడెం శివారులోని దోర్నాల వెళ్లే రహదారి పక్కన ఉన్న అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా అక్కడి మల్లెలమ్మ గుండ్ల వాగు వద్ద అటవీ ప్రాంతంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి ఆ బట్టీ వద్ద 18 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని 10 ప్లాస్టిక్ డ్రమ్ములలో ఉన్న 2000 వేల లీటర్ల బెల్లపు ఊటను, నాటుసారాతయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఆ బట్టి నిర్వాహకుడు సిద్ధాపురం గ్రామానికి చెందిన నాగరాజుదిగా గుర్తించామని పేర్కొన్నారు.

నందికొట్కూరులో బెల్లం ఊట ధ్వంసం

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు పట్టణంలోని షికారి పేట కాలనీలో భూగర్భంలో దాచిన 500 లీటర్ల బెల్లం ఊటను నందికొట్కూరు పోలీసులు ధ్వంసం చేశారు. అలాగే బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కోళ్లబావాపురం గ్రామ పొలిమేరలో మరో 500 లీటర్ల నాటుసారా బెల్లం ఊటను కూడా ధ్వంసం చేసినట్లు సీఐ ప్రకాష్‌కుమార్, ఎస్ఐ హుస్సేన్‌బాషా తెలిపారు. కోళ్లబావాపురం లో ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో మిడుతూరు, ముచ్చుమర్రి, బ్రాహ్మణకొట్కూరు పోలీసులు పాల్గొన్నారు.

వివేకానందుని మార్గం ఆదర్శనీయం



వివేకానందుని చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, జనవరి 12: ఆధ్యాత్మిక, తత్వవేత్త స్వామి వివేకానందుని మార్గదర్శకాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆత్మకూరు ఎంపీడీవో మోహన్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్ర టోర్నీలో వివేకానంద 161వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యాలయ సూపరింటెండెంట్ మోహన్‌కుమార్, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పాములపాడు : మండలంలో స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాములపాడులోని శ్రీ వివేకానంద విద్యావిహార్ కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్ గోపాల్, ఇస్కాల గ్రామంలో ఇస్కాల గ్రామ యువజన సేవాసమితి నవీన్, రాంప్రసాద్, విక్రం, శివ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

పాణ్యం : ఆర్జీఎం విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వివేకానందుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, శాంతిరాం ఫార్మసీ కళాశాలల్లో విద్యార్థులకు వివేకానందుని సందేశాలను వివరించారు.

నంద్యాల (కల్చరల్): గణేష్ కేంద్ర సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద కాంస్య విగ్రహానికి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ రామక్రిష్ణారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, గణేష్ కేంద్ర సమితి సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గణేష్ కేంద్రసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశిస్తే ఆళ్లగడ్డ నుంచి పోటీ : ఏవీ



మాట్లాడుతున్న ఏవీ సుబ్బారెడ్డి

నంద్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానం ఆదేశిస్తే ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుస్తానని టీడీపీ సీనియర్ నాయకుడు, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి అన్నారు. నంద్యాలలోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండ్రోజుల క్రితం ఆళ్లగడ్డలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 'రా.. కదలి రా!' అంటూ నిర్వహించిన సభ భారీగా విజయవంతం అయిందని, ఈ సభ సక్సెస్ కావడానికి ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కృషి చేశారని అభినందనలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు సీఎం కావడం తథ్యమన్నారు. ఆళ్లగడ్డ సభకు రావద్దంటూ తనకు ఎవరూ అల్టిమేటం జారీ చేయలేదన్నారు. గత అనుభవాల దృష్ట్యా సభలో పాల్గొనకపోవడమే మంచిదని, అనుకోని ఘటనలు ఏవైనా జరిగితే పార్టీకి ఇబ్బంది అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పార్టీ పరిశీలకులు ప్రభాకర్ చౌదరి చెప్పడంతో మానుకున్నానని పేర్కొన్నారు. పార్టీ శ్రేయస్సు కోరి సభకు హాజరు కాలేదు తప్పించి ఎవరికీ తాను భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల నంద్యాల పట్టణంలో వెలిసిన పోస్టర్లు మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని, వాటి వెనుక ఎవరు ఉన్నారో? పోలీసులు ఆరా తీసి వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

త్వరలో వసతి గదుల నిర్మాణానికి భూమి పూజ

మహానంది,జనవరి 12: మహానంది క్షేత్రంలో భక్తుల వసతి గదుల నిర్మాణానికి త్వరలో భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం క్షేత్ర పరిసరాల్లో రూ.10.50 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 55 గదులకు అవసరమైన స్థలంలో సిబ్బంది చేస్తున్న జంగిల్ క్లియరెన్స్ పనులను ఏఈఓ ఎర్రమల్ల మధుతో కలసి ఈవో పరిశీలించారు. త్వరలో మహానంది ఆలయాన్ని దర్శించే భక్తులకు వసతి గదుల సమస్య తీరనుందన్నారు. ఇప్పటికే రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా కాంట్రాక్ట్ పనులు అప్పగించినట్లు పేర్కొన్నారు.

బాలకృష్ణమ్మ ఆశయాలను కొనసాగిస్తాం

నంద్యాల (నూనెపల్లె), జనవరి 12: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, ప్రజాతంత్ర ఉద్యమాల నాయకుడు మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలను కొనసాగిస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవ స్వామి, సాంబశివుడు అన్నారు. మార్పు బాలకృష్ణమ్మ 11వ వర్ధంతి సందర్భంగా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఏపీటీఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఉద్యమానికి తొలి గురువు, 77 సంవత్సరాల ఏపీటీఎఫ్ ఉద్యమ చరిత్రలో ఆయన పాత్ర మహోన్నతమైనదని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తితో ఉపాధ్యాయులు ఉద్యమాలు చేయాలని, విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పుల్లయ్య, మునిస్వామి, నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణుడు, మద్దిలేటి, రవి, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

28వ రోజు తిరుప్పావై ప్రవచనాలు

నంద్యాల (కల్చరల్), జనవరి 12: సంజీవనగర్ కోదండరామాలయంలో టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు, నంద్యాల భగవత్ సేవా సమాజ్ కమిటి సంయుక్త నిర్వహణలో తిరుప్పావై ప్రవచనాలు 28వ రోజు కొనసాగాయి. డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు వాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బాగంగా శుక్రవారం పాశురం గురించి వివరించారు. గోవిందా నామస్మరణతో భక్తులు పరవశమయ్యారు.

వైభవంగా లక్ష తులసీ పూజ : నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో విష్ణుమూర్తికి ప్రీతికరమైన లక్ష తులసీ మాలలతో పూజలు చేశారు. ధనుర్మాసం శుక్రవారం గోదాదేవికి ప్రీతికరమైన కూడార్రై పాయం స్వామివారికి నివేదించారు. ఈ కార్యక్రమానికి వాఖ్యాతగా డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు వ్యవహరించారు.

భారీ వాహనాల రాకపోకలను నియంత్రించండి

గడివేముల, జనవరి 12: గడివేముల మీదుగా భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ రాజునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం గడివేముల మండల కేంద్రంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ర్యాలీగా వెళ్లి ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికే సుమారు ఆరుగురు మృత్యువాత పడ్డారని అన్నారు. మృతి చెందిన కుటుంబాలకు జిందాల్ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల నాయకులు రవీంద్రనాథ్, రియాజ్, నాగనవీన్, సుంకన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు

బండిఆత్మకూరు, జనవరి12: బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కృష్ణనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ, బాదుల్లా స్వామి సరిగెత్తు పురస్కరించుకొని గ్రామంలో తెలుగు రాష్ట్రాల సంయుక్త ఎద్దుల బలప్రదర్శన పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 16వ తేదీన మంగళవారం ఉదయం 10 గంటలకు ఆరుపళ్ల సైజు (చిన్నబండ) విభాగపు పోటలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ పోటీలలో విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.8వేలు బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే ఈ నెల 17వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు సీనియర్ విభాగం ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వివరాలకు 9948383592కు సంప్రదించాలన్నారు.

17న అంతర్రాష్ట్ర పాలబండ లాగు పోటీలు

కొత్తపల్లి, జనవరి 12 : తాండవ మల్లేశ్వరస్వామి తిరుణాలను పురస్కరించుకొని 14 నుంచి 17వరకు అంతర్రాష్ట్ర పాలబండలాగు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందే వృషభరాజులకు ప్రథమ బహుమతి 50వేలు, రెండవ బహుమతి 20వేలు, మూడవ బహుమతి 10వేలు, నాల్గవ బహుమతి 5వేలు, ఐదవ బహుమతి 3వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పోలీస్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం : ఎస్పీ

నంద్యాల క్రైం, జనవరి 12 : పోలీస్ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ సంక్షేమ దివస్‌ను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహి స్తున్న పోలీస్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, హోంగార్డులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. వారి నుంచి వినతులు స్వీకరించిన ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సిబ్బంది నివేదించిన సమస్యలపై ఎస్పీ తక్షణమే స్పందించి నేరుగా సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయ అధికారులను పరిష్కారదిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పోలీస్ వెల్ఫేర్ కార్యక్రమం ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకొని పరిష్కరిస్తామన్నారు. విధినిర్వహణలో సిబ్బంది ఇబ్బందులు పడకుండా వారి సమస్యలను తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యడమే తమ లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీతోపాటు స్పెషల్‌బ్రాంచ్ సీఐ సూర్యమౌళి పాల్గొన్నారు.

కాచిగూడ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక పునరుద్ధరణ

నంద్యాల (నూనెపల్లె), జనవరి 12: గుంటూరు - నంద్యాల రైలు మార్గంలో డబ్లింగ్ పనుల నిమిత్తం రద్దు అయిన 17251 గుంటూరు - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలును సంక్రాంతి సెలవుల దృష్ట్యా తాత్కాలికంగా పునరుద్ధరిస్తున్నట్లు రైల్వే వర్గాలు శుక్రవారం పేర్కొన్నాయి. కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 15వ తేదీన గుంటూరులో పునఃప్రారంభమై జనవరి 21వ తేదీ వరకు తిరుగుతుందని తెలిపారు. అదే విధంగా 17252 కాచిగూడ -గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు కాచిగూడలో 16వ తేదీన పునఃప్రారంభమై జనవరి 22వ తేదీ వరకు తిరుగుతుందని పేర్కొన్నారు. 17261/17262 గుంటూరు - తిరుపతి, తిరుపతి - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలును సంక్రాంతి సెలవుల దృష్ట్యా ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 3 అదనపు జనరల్ బోగీలను ఈ నెల 20వ తేదీ వరకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలపై టీడీపీ నాయకుల చర్చ

జూపాడుబంగ్లా, జనవరి 12: మంగళగిరి జాతీయ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నంద్యాల జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి గిరీశ్వరరెడ్డి టీడీపీ రాష్ట్ర నాయకులు బీటీ జనార్దన్‌తో కలిశారు. నందికొట్కూరు నియోజకవర్గ సమస్యలు, ఎన్నికలవేళ అభ్యర్థి నియమించే విషయంపై చర్చించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో ముఖ్యంగా ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలపై అడిగినట్లు చెప్పారు.

నేడు మండలంలో విద్యుత్ కోత

పాములపాడు, జనవరి 12 : మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు కోత విధిస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి అబ్దుల్ హబీబ్ శుక్రమవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మెయింటినెన్స్ ఉన్నందున ఉదయం 8 నుండి మధ్యాహ్నం రెండుగంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

గడివేముల, జనవరి 12: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ భారీ వాహనాలు గడివేముల మీదుగా రాకపోకలు నియంత్రించేందుకు బూజనూరు బాట వద్ద, గడివేముల వెలుపల ఉన్న పెట్రోల్‌బంకు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని అన్నారు. భారీ వాహనాల రాకపోకలను నియంత్రిస్తామని పేర్కొన్నారు.

మండల అబివృద్ధికి పాటుపడుదాం

వెలుగోడు, జనవరి 12 : మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు ఐక్యంగా అభివృద్ధి కోసం పాటుపడదామని ఎంపీపీ లాలం రమేశ్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నసిరుద్దీన్‌బాబు, గ్రామ సర్పంచు వేల్పుల జయపాల్, మోత్కూర్ సర్పంచ్ చిన్నక్క సమస్యలపై అధికారులను నిలదీశారు. ప్రతి సమావేశానికి అధికారులు రావడం, నివేదికలు చదవడం తప్ప గత సమావేశాలలో సభ్యులు ప్రశ్నించిన సమస్యల గూర్చి సమాధానాలు తెలుపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఓ అనధికారి వ్యక్తి సమావేశంలో మైక్ పట్టుకొని గ్రామీణ ఉపాధి హామీ గృహ నిర్మాణశాఖ, గ్రామీణ నీటి సరఫరా అధికారులపై ప్రశ్నించడంపై అధికారులు అవాక్కయ్యారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావడంతో సమావేశాన్ని మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపించారు.

సంతలో నాలుగు సెల్‌ఫోన్ల చోరీ

జూపాడుబంగ్లా, జనవరి 12: మండలకేంద్రంలో శుక్రవారం జరిగిన వారపుసంతలో నాలుగు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. జూపాడుబంగ్లాకు చెందిన వెంకటేశ్వర్లు, తాటిపాడు గ్రామానికి చెందిన ఖాజీకురైషన్, దొరస్వామితో మరోకవ్యక్తికి చెందిన విలువైన సెల్‌ఫోన్లు గుర్తుతెలియని దొంగలు చోరీ చేసినట్లు బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రతివారం గస్తీ ఏర్పాటు చేస్తామని పోలీసులు చెప్పారు.

'త్యాగరాజ మందిర నిర్మాణానికి సహకరించండి '

ఆత్మకూరు, జనవరి 12: ఆత్మకూరు ప్రాంతంలో త్యాగరాజ మందిర నిర్మాణం కోసం సహకరించాలని నాయిబ్రాహ్మణ పట్టణ కమిటీ శుక్రవారం ఆసంఘం రాష్ట్ర నాయకులను కోరారు. ఇటీవల ఆత్మకూరు నగర నాయిబ్రాహ్మణ సంఘం నూతనంగా ఎన్నిక కావడంతో వారు స్థానికంగా నాయిబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర, జిల్లా కమిటీల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర కోశాధికారి విజేయుడు, ప్రధాన కార్యదర్శి ఊడిమలుపు సుబ్బరాయుడు మాట్లాడుతూ.. నాయిబ్రాహ్మణులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని సూచించారు. ఆత్మకూరు కమిటీ అధ్యక్షులు శివపాములేటి, ఉపాధ్యక్షులు ఎల్లప్ప, వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులు పెద్దస్వాములు, గాలెన్న, కోశాధికారి అనిల్‌కుమార్, రుద్రప్రసాద్, సహాయ కార్యదర్శులు బోధనం సుబ్బరాయుడు, జనార్ధన్, శేఖర్ ఉన్నారు.

రబీ పంటలకు ఈ-క్రాప్ చేయించుకోండి

ఆత్మకూరు, జనవరి 12: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఆత్మకూరు డివిజన్ ఏడీఏ అంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయాశాఖాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బాలస్వామి తదితరులు ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వచ్చే ఎన్నికల్లో టీడీపీదే అధికారం

● మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

చాగలమర్రి, జనవరి 12: వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ పతనం తప్పదని అన్నారు. టీడీపీ పార్టీని నమ్మి వచ్చిన కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో వైసీపీకి చెందిన 40 కుటుంబాలు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉపసర్పంచ్ శ్రీనివాసులు, నరహరి, హరిశ్చంద్ర, చెంచురాజు, రమణ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, భార్గవ్‌రామ్ నాయుడు, నరసింహారెడ్డి, అన్సర్‌బాషా, నల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ వ్యవస్థాపకుడు వెంకటరత్నం వర్ధంతి

బనగానపల్లె, జనవరి 12: పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్, వెంకటేశ్వర్లు అధ్యక్షతన యూటీఎఫ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన వెంకటరత్నం వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్, దస్తగిరి, సుధాకర్, కృష్ణయ్య, విజయకుమార్, పూజారి శ్రీనివాసులు, సతీశ్‌కుమార్, డేవిడ్, గోపాల్, మనోహర్, మల్లికార్జున, లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



సంజామలలో వివేకానంద చిత్రపటం వద్ద నివాళి

చాగలమర్రి, జనవరి 12: చాగలమర్రిలోని సమరసతా సేవా ఫౌండేషన్ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ ఎం.లక్ష్మీదేవి, మహాలక్ష్మి, రమాదేవి, భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, సోమేశ్వరి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: యువత స్వామి వివేకానంద బాటలో నడవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) నాయకురాలు నిర్మల పిలుపు నిచ్చారు. పట్టణంలోని భారతీ విద్యామందిరంలో శుక్రవారం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆపస్ గౌరవాధ్యక్షుడు సుధాకరరావు, రామకృష్ణ, ప్రవీణ్‌కుమార్, విప్రనారాయణ, మునిమోహన్, రామాంజనేయులు, నరసింహులు పాల్గొన్నారు.

బనగానపల్లె: వివేకానందుడి జీవితాన్ని, బోధనలను ఆదర్శంగా తీసుకోవాలని నందవరంలోని గురుమహారాజ్ సదానంద యోగి ఆశ్రమం అన్నదాన ట్రస్టు సభ్యుడు భువనేశ్వర్‌రాజు, సంధ్య వీరశెట్టి సూచించారు. శుక్రవారం ఆశ్రమంలో వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. విశ్వనాథ్, తిరుమలయ్య, అరవింద్, మనోహర్, విశ్వనాథ్, ఈశ్వర్, పార్వతి, రామతులసి, రామసుబ్బయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

సంజామల: వివేకానందుడి జీవితాన్ని, బోధనలను ఆదర్శంగా తీసుకోవాలని సంజామల మండలం గిద్దలూరు మినీ గ్రంథాలయ నిర్వాహకుడు మద్దిలేటి కోరారు. శుక్రవారం వివేకానంద జయంతి సందర్భంగా మిని గ్రంథాలయంలో ఆయన చిత్రపటం వద్ద అర్పించారు. మిద్దె కృష్ణమూర్తి, సందీప్, విజయకుమార్, ఓబయ్య, శ్రీను, పాఠకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీయూ

చాగలమర్రి, జనవరి 12: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్టీయూ సంఘం మండల అధ్యక్షుడు మస్తాన్‌వలి, కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్ డిమాండ్ చేశారు. శుక్రవారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయం ఎదుట వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం నంద్యాలలో జరిగే వజ్రోత్సవ సంబరాలకు వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ పెద్దవంగలి ప్రసాద్, నాయకులు నారాయణరెడ్డి, మహబూబ్‌బాష, రాజశేఖర్ రెడ్డి, శేషాద్రి, సురేషప్ప, ఉస్మాన్, నరసింహులు, సంజీవరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'టీడీపీలోనే కొనసాగుతాం'



వైసీపీ నుంచి తిరిగి టీడీపీలోకి వచ్చిన కార్యకర్తలు

ప్యాపిలి, జనవరి 12: టీడీపీలో తాము కొనసాగుతామని ఎస్ రంగాపురం కార్యకర్తలు మరమేసి నాగన్న, రాముడు, చిన్న పెద్దయ్య, నాగేశ్వరరావు తదితరులు తెలిపారు. రెండు రోజుల క్రితం వీరందరూ వైసీపీలో చేరారు. అయితే టీడీపీ నాయకులు గండికోట రామసుబ్బయ్య, కలచట్ల ప్రసాద్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. దీంతో వైసీపీలోకి వెళ్లిన వారంత తిరిగి శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ కండువ కప్పుకున్నారు. నాయకులు రామాంజినేయులు, రవి, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

'వైద్య సేవలు సక్రమంగా అందించాలి'

ప్యాపిలి, జనవరి 12: హెల్త్ కినిక్‌లను సక్రమంగా నిర్వహించాలని, వైద్యాధికారి వాణిశ్రీ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం క్లినిక్ వచ్చిన రోగులకు వైద్యులు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

'కాపు, బలిజ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి'



శివరాయల్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న దేవినాయుడు

ఆళ్లగడ్డ, జనవరి 12: ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో కాపు, బలిజ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని రాయల్ కాప్స్ రెండు రాష్ట్రాల చైర్మన్ బోళ్ల దేవి నాయుడు పిలుపు నిచ్చారు. శుక్రవారం అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామిని దేవి నాయుడు, హైకోర్టు న్యాయవాది బోళ్ల బాలాజీ దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన రాయల్ కాప్స్ సమావేశంలో ఏపీ, తెలంగాణ రాయల్ కాప్స్ యువ పొలిటికల్ ప్రెసిడెంట్‌గా శివ రాయల్, రాష్ట్ర నాయకుడిగా గూడూరు సంజీవరాయుడుతో పాటు మరికొందరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బలిజ, కాపు నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



కొలిమిగుండ్లలో సంఘీభావం తెలుపుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి



రుద్రవరంలో..



ఉయ్యాలవాడలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

కొలిమిగుండ, జనవరి 12: అంగన్‌వాడీలు చేపట్టిను సమ్మె శుక్రవారం 32వ రోజు కొనసాగింది. టీచర్లు, ఆయాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. కొలిమిగుండ్లలో తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్దకు వెళ్లి బీసీ జనార్దన్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 32 రోజులగా సమ్మె చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం కనీసం వారి సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా చట్టంతో భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు.

ఆళ్లగడ్డ: అంగన్‌వాడీల సమ్మె ఆళ్లగడ్డలో కొనసాగుతోంది. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మె చేపట్టారు. డిమాండ్లను నెరవేర్చే దాకా సమ్మె ఆగదని అన్నారు.

శిరివెళ్ల: ప్రభుత్వం దిగొచ్చి డిమాండ్లను నెరవేర్చేంత వరకు పోరాటం చేస్తామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. శిరివెళ్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం సమ్మె కొనసాగించారు.

రుద్రవరం: రుద్రవరంలో శుక్రవారం 32వ రోజు అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తమ జీతాలు పెంచకుండా చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని వాపోయారు. ఎస్మా చట్టం, షోకాజ్ నోటీసులు బెదిరింపులతో సమ్మె ఆగదని వారు అన్నారు.

చాగలమర్రి: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె ఆగదని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం చాగలమర్రిలోని పాత హైవే రహదారి నందు చిన్నారులు, అంగన్‌వాడీలు, హెల్పర్లు కలిసి బైఠాయించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, ఆయా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

● మండలంలోని 52 అంగన్‌వాడీ కేంద్రాలు, మినీ కేంద్రాలకు శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, వీఆర్వోలు కలిసి షోకాజ్ నోటీసులు అంటించారు. చెంచుగూడెంలోని మినీ కేంద్రానికి షోకాజ్ నోటీసు అంటించారు. ఆమె మాట్లాడుతూ షోకాజ్ నోటీసులను ఆయా అంగన్‌వాడీ వర్కర్ల గృహాలకు కూడా అంటించామని తెలిపారు.

ఉయ్యాలవాడ: అంగన్‌వాడీలు ఉయ్యాలవాడలో చేపట్టిన సమ్మె శుక్రవారంకొనసాగింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా జీతాలు పెంచే దాకా సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు.

దొర్నిపాడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. 32 రోజులుగా అంగన్‌వాడీ సిబ్బంది దీక్షను కొనసాగిస్తున్నారు.



చాగలమర్రి పాత హైవేపై ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



దొర్నిపాడులో..



ఆళ్లగడ్డలో..



శిరివెళ్లలో..

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: బీసీ



వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లెలో కరపత్రాలు అందిస్తున్న బీసీ ఇందిరమ్మ

కొలిమిగుండ్ల జనవరి 12: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. కొలిమిగుండ్లలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొలిమిగుండ్లలో నిర్వహించారు. శాంతినగర్, ప్రభుత్వ ఆస్పత్రి కాలనీ, మసీదువీధి, అల్లాకాలనీ, పాతఊరు, దళిత కాలనీ, లక్ష్మీపురం నాయిబ్రాహ్మణ కాలనీల్లో విస్తృతంగా పర్యటించి మేనిఫెస్టో కరపత్రాలు అందించారు. కొలిమిగుండ్లలో శాంతినగర్‌కు చెందిన 80 వైసీపీ కుటుంబాల వారు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో చేరారు. వారందరికీ టీపీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే శాంతినగర్‌కు చెందినస్ఏవవార్డు సభ్యులు రాజినేనిరాము టీడీపీలో చేరారు. బీసీ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజల సంక్షేమం వదిలేసి ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నాయకులు ఐవీ ఫక్కీరారెడ్డి, మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మిరెడ్డి, అందెరాము, రవిప్రకాశ్‌రెడ్డి, ఎల్ఐసీ చిన్నపురెడ్డి, మంద విజయకుమార్, బొట్టుస్వామి, వెంకటరాముడు, గురుస్వామి, నారాయణరెడ్డి, బిజ్జం భాస్కర్‌రెడ్డి, బెలుం రాఘవరెడ్డి, మల్లారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, జనసేన, టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

బనగానపల్లె: అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని బనగానపల్లె టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. బనగానపల్లె పట్టణంలోని కొండపేటలోని నాలుగు స్తంభాల గుడి వీధిలో బీసీ ఇందిరమ్మ ఇంటింటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అర్హులైన నిరుపేదలకు ఖచ్చితంగా 2 సెట్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. సీఎం జగన్ పారిశ్రామికవేత్తలను బెదిరించి పరిశ్రమలు రాకుండా చేశారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రవరం: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు బండారు బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీతో గ్రామసీమలు అభివృద్ధి చెందాయన్నారు.

దొర్నిపాడు: వైసీపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. మండలంలోని భాగ్యనగరం గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి అనంతరం ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి సురేంద్ర, తాళ్లూరి రమేష్‌నాయుడు, హర్షవర్ధన్, సిద్ధి సత్యం, వెంకట్‌నాయుడు, ఎండూరి గోపాల్‌నాయుడు, దయానందరావు, చౌడయ్య, అర్జునాపురం సర్పంచ్ భూమా ప్రభాకర్‌రెడ్డి, పుల్లయ్య, మహిళలు పాల్గొన్నారు.

శిరివెళ్ల: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శిరివెళ్లలోని నాయిబ్రాహ్మణ కాలనీలో ఆయన శుక్రవారం పర్యటించి మిని మ్యానిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయకత్వంలో పార్టీ గెలుపొందాలని అన్నారు. నాయకులు కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, మాజీ జెడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, తిరుమల వెంకటరవి, కొండబోయిన బాలచంద్రుడు, రాచర్ల రమేష్, బీఎండీ రఫి, అబూబకర్ సిద్ధిక్, ఉల్లి వెంకటసుబ్బయ్య, షేక్షా, పీపీ లింగమయ్య, తానిషా, యామా శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మన్నె మల్లేశ్వరి

డోన్, జనవరి 12: పట్టణంలోని సాయిబాబా గుడి ఆవరణలో శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోతో ఓ మహిళ వేసిన ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీడీపీ డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి సతీమణి మన్నె మల్లేశ్వరి ముగ్గుల పోటీలను పర్యవేక్షించారు. టీడీపీ నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి మంచి స్పందన లభించడంతో ఆ ప్రాంతమంతా సందడిగా కనిపించింది. పోటీల్లో విజేతగా నిలిచిన బేతంచెర్లకు చెందిన లక్ష్మిరేణుకకు మొదటి బహుమతిగా రూ.15వేలు నగదును మన్నె మల్లేశ్వరితో పట్టణ టీడీపీ అధ్యక్షులు సీయం శ్రీనివాసులు అందజేశారు. రెండో బహుమతి భార్గవి రూ.11వేలు, మూడో బహుమతి మహేశ్వరికి రూ.7500 అందజేశారు.

'విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న జాకీరుల్లాబేగ్

బేతంచెర్ల జనవరి 12: డోన్‌లో నిర్వహించే టీడీపీ ముస్లిం మైనార్టీ సమావేశాన్ని ముస్లిం, మైనార్టీ సోదరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రాష్ట్రం ముస్లిం టీడీపీ నాయకులు జాకీరుల్లా బేగ్ పిలుపునిచ్చారు. శుక్రవారం బేతంచెర్లలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డోన్ పట్టణంలో శనివారం ఉదయం 9.30 గంటలకుసాయి ఫంక్షన్‌హాల్‌లో ముస్లిం, మైనార్టీ సోదరుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలు అధికంగా తరలిరావాలని కోరారు. మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఫయాజ్, జక్రియా, అంజాద్, సిద్దిక్, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

రుద్రవరం, జనవరి 12: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. శాఖల వారీగా అధికారులు తమ శాఖ వివరాలు చదివి వినిపించారు. ఎంపీటీసీలు మాత్రం ప్రజా సమస్యల పట్ల స్పందించలేదు. ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలు సభ దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ గిడ్డయ్య, జడ్పీటీసీ సభ్యురాలు మాధవి, ఏవో వరలక్ష్మి, ఏఈలు వెంకటరాముడు, ప్రమోద్, మునాఫ్, ఏవో శ్రీకృష్ణ, వైద్యాధికారి బాబు, కో ఆప్షన్‌మెంబరు మదార్‌సాహెబ్, ఇన్‌చార్జి ఎంఈవో కోటయ్య, ఎంఈవో-2 లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి'

బనగానపల్లె, జనవరి 12: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ముస్లిం ఆధ్యాత్మిక గురువు బీఆర్ సీరాజ్ ఉర్ రహిమాన్ సూచించారు. శుక్రవారం రాత్రి ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ముస్లింల పురోగతిఎప్పుడు, ఎలా అన్న అంశంపై ముస్లింలకు అవగాహన కల్పించారు. సమాజంలో ముస్లిం యువత ఉద్యోగాలు లేక ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారని వారు స్వశక్తితో ఎదగాలని సూచించారు. మానవ జీవన విధానం, మానవ సంబంధాల గురించి ప్రవచించారు. ప్రతి ముస్లిం మహమ్మద్ ప్రవక్త బాటలో నడవాలని సూచించారు. మహమ్మద్ ప్రవక్త బోధనలను పాటించాలని కోరారు.

నేడు ముస్లింల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

డోన్, జనవరి 12: డోన్ నియోజకవర్గ స్థాయి ముస్లీం మైనార్టీల సమావేశాన్ని టీడీపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్నట్లు ముస్లీం మైనార్టీ నాయకులు అల్లాబకాష్, నజీర్, జబ్బార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సుబ్బారెడ్డి నివాసంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో నిర్వహించే సమావేశానికి శాసన మండలి మాజీ చైర్మేన్ షరీఫ్ హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని ముస్లీం మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ నాయకులు అజీజ్, మహమ్మద్ రఫీ, మస్తాన్, సర్దార్‌పాషా, జలీల్, హుసేన్‌పీరా, ఆలీబాబా, మాబుహుసేన్ పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

బనగానపల్లె, జనవరి 12: మండలంలోని చౌడేశ్వరీమాత ఆలయానికి ముంబై వాస్తవ్యులు దివంగత హనుమంత్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు జానకిభండారి ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయ ఈవో రామానుజన్‌కు రూ.లక్ష నగదును విరాళంగా అందించారు. ఈ మొత్తంతో ఆలయాభివృద్ధికి ఖర్చు చేయాలని కోరారు. ఈవో మట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి నందవరం ఆలయాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆర్‌బీకేల్లో జొన్నలు, కందులు కొనుగోలు

బనగానపల్లె, జనవరి 12: మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధరకు కందులు, జొన్నలు కొనుగోలు చేయనున్నట్లు నంద్యాల వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రైతు భరోసా కేంద్ర సిబ్బందికి కొనుగోలుపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేయాలని, ఈకేవైసీ చేయించుకునేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

'పంట నమోదు తప్పనిసరి'

చాగలమర్రి, జనవరి 12: పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ సూచించారు. శుక్రవారం చాగలమర్రి వ్యవసాయ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ హైబ్రిడ్ జొన్న రకం క్వింటా ప్రభుత్వం రూ.3,100కు కొనుగోలు చేస్తుందని చెప్పారు. రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు. పశువైద్యాధికారి సాయిబాబా మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశువులకు టీకాలు వేస్తున్నామని తెలిపారు.

రుద్రవరం: మండలంలో జొన్న సాగు చేసిన రైతులు ఆర్‌బీకేలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో శ్రీకృష్ణ శుక్రవారం తెలిపారు. మండల స్థాయి వ్యవసాయ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షుడు ఎర్రం నర్శిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దొర్నిపాడు: జొన్న పంట సాగు చేసిన రైతులు ప్రభుత్వానికి విక్రయించాలంటే పంటలను నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి సునీత సూచించారు. దొర్నిపాడు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండల స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

'ఈకేవైసీ చేయించుకోవాలి'

కోవెలకుంట్ల, జనవరి 12: రైతులు పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకుడు సుధాకర్ సూచించారు. శుక్రవారం కోవెలకుంట్ల వ్యవసాయ కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బంది, మండల సలహామండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ జొన్నలు ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని కొను గోలు విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఏవో నిరంజన్, రైతు సంఘం అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, సలహా మండలి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'సద్వినియోగం చేసుకోవాలి'

శిరివెళ్ల, జనవరి 12: జొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ సూచించారు. శిరివెళ్లలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం అధ్యక్షతన శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. మద్దతు ధర క్వింటా రూ.3,180కు జొన్నలను ప్రభుత్వానికి విక్రయించాలన్నారు. డీఆర్సీ వ్యవసాయాధి కారి ప్రభావతమ్మ, పశుసంవర్థక శాఖ వైద్యుడు దస్తగిరి, సలహా మండలి సభ్యులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజవంశీకుడి వారసుడు మృతికి సంతాపం

అవుకు, జనవరి 12: అవుకు అరవీటి రాజవంశీకుడి వారసుడు నంద్యాల రామకృష్ణమరాజు (65) గుండెపోటుతో మృతి చెందాడు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అవుకుకు చేరుకొని రామకృష్ణమరాజు భౌతిక కాయానికి శుక్రవారం నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సెల్ టవరెక్కిన సబ్ కాంట్రాక్టర్



సెల్ టవర్‌పై సబ్ కాంట్రాక్టర్

బేతంచెర్ల, జనవరి 12: ప్రొద్దుటూరుకు చెందిన కాంట్రాక్టర్ తనకు డబ్బులు చెల్లించడం లేదని తణుకు ప్రాంతానికి చెందిన సబ్ కాంట్రాక్టర్ సత్య నారాయణ శుక్రవారం పట్టణంలోని పోలీసు స్టేషన్ వెనుక ఉన్న సెల్ టవర్‌ను ఎక్కారు. తనకు డబ్బులు చెల్లించలేదని, కుటుంబం గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ హామీ ఇవ్వడంతో సెల్ టవర్‌నుంచి దిగి వచ్చారు. రోడ్డు కాంట్రాక్టరు రూ.10.49 లక్షలు ఇవ్వాలని, ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా డబ్బులు ఇవ్వడం లేదని చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎక్కిన ఆయనను 2:30 గంటల సమయంలో గమనించారు. సాయంత్రం 5 గంటల వరకు సెల్‌టవర్ మీదే ఉన్నారు. అనంతరం సత్యనారాయణను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈనెల 25న పోలీసు స్టేషన్ వద్దకు రావాలని కాంట్రాక్టర్ చెప్పారు. దీంతో సత్యనారాయణ అక్కడి నుంచి వెళ్లిపోయారు.